ప్రత్యేక నిధులతో కంటోన్మెంట్ అభివృద్ధి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్ : సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ప్రత్యేక నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. 4వ వార్డులోని ఎల్‌ఐసీ కాలనీలో రూ.30 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్, రూ.7లక్షలతో చేపట్టనున్న బోర్‌వెల్ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి ఎద్దడి నివారణకు బోర్‌వెల్, కాలనీవాసుల శుభకార్యాలు తదితర కార్యక్రమాల కోసం కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దుబ్బాక కిషన్‌రావు, నాయకులు సత్యనారాయణ, సురేఖ, వెంకటేశ్, ఆలయ కమిటీ చైర్మన్ సాంబశివ, కిరణ్ పాల్గొన్నారు.

తాళ్ల అజయ్‌కి డాక్టరేట్



పీహెచ్‌డీ గైడ్ ప్రొ అర్జున్‌రావు, అధ్యాపకులతో అజయ్

లాలాపేట: ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చరిత్ర అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసిన తాళ్ల అజయ్‌కి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఓయూ ఆర్ట్స్ కళాశాల హిస్టరీ డిపార్టుమెంట్ రిటైర్డు అధ్యాపకుడు ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి పర్యవేక్షణలో 'తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర(1956–2014) అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను యూనివర్సిటీ పరీక్షల విభాగం అజయ్‌కి డాక్టరేట్‌ను అందజేసింది. వరంగల్ జిల్లా చెన్నారావు పేటకు చెందిన తాళ్ల అజయ్ ప్రస్తుతం తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపకుడిగా కొనసాగుతున్నారు. ఓయూ కేంద్రంగా సామాజిక ఉద్యమాలు నడిపిస్తున్నారు.

రేపటి నుంచి వేద విద్వన్మహా సభలు



కరపత్రాన్ని ఆవిష్కరించిన ట్రస్ట్ ప్రతినిధులు

పద్మారావునగర్: స్కందగిరి ఆలయంలో ఈనెల 8 నుంచి తెలంగాణ 25వ వేద విద్వన్మహా సభలు ప్రారంభం కానున్నాయని శ్రీ జనార్దనానంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్ట్ చైర్మన్ తూములూరి శాయినాథ శర్మ, ప్రధాన కార్యదర్శి పసుమర్తి బ్రహ్మానంద శర్మ, జీవీ రావు, జయశంకర్ తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 9న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. 11న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, విశ్రాంత న్యాయమూర్తి బులుసు శివశంకర్, సీనియర్ ఐఏఎస్ శైలజా రామయ్యర్, శాంతా బయోటెక్నిక్స్ చైర్మన్ కేఐ వరప్రసాద్‌రెడ్డి, 12న ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. విశ్రాంత ఐఏఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగే కార్యక్రమాల్లో ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు.

'పిటిషన్ కొట్టివేయడంపై హర్షం'

అమీర్‌పేట: తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీఓకు వ్యతిరేకంగా వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంపై టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమా సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బీసీల రిజర్వేషన్లు ఆపాలని జరుగుతున్న ప్రయత్నాలకు అడ్డుకట పడిందని, ఆ విషయమై కాంగ్రెస్ ప్రభుత్వం పోరాడుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షల వెల్లువ

- ఘనంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలు
- ఆలయాలో ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు

నియోజకవర్గవ్యాప్తంగా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు. అలాగే పలువురు ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ తలసానికి లేఖ పంపారు. అదేవిధంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు బర్త్‌డే విషెస్ తెలిపారు. ఆయా చోట్ల నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

–సనత్‌నగర్, జోన్ బృందం



తలసానికి శుభాకాంక్షలు చెబుతున్న బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి



నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



సనత్‌నగర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో పూజల్లో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి



గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన పుట్టల శేఖర్



ఎమ్మెల్యే తనయుడితో కలిసి కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



బల్కంపేట ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో దుప్పట్లు, శ్రీనన్న కిట్లను పంపిణీ..



పాట్టిరాములు నగర్‌లో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ కె. హేమలత



చిన్నారుల మధ్య బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వాన.. వరద..!

- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో వాన..వరదతో జనం అవస్థలు పడుదున్నారు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం.. అధికారుల బాధ్యతారాహిత్యం ప్రజలకు గుది బండగా మారుతున్నది. చిన్నపాటి వర్షానికే రోడ్లు, వీధులు, లోతట్టు ప్రాంతాలు చెరువును తలపిస్తున్నాయి.

☛ ఇటీవల కురిసిన వర్షాలకు సికింద్రాబాద్ పరిసరాలు ఎక్కడ చూసినా చిన్నపాటి కుంటలు, చెరువులను తలపించే వాతావరణం కనిపించింది. గత బుధవారం రాత్రి కురిసిన వర్షానికి బన్సీలాల్‌పేట్ బైబిల్ హౌస్ రైల్వే బ్రిడ్జి కింద భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరింది. నడుములోతు వరకు వరద నీరు వచ్చి చేరడంతో ట్రాఫిక్ పోలీసులు ఈ రహదారిని మూసివేశారు. అదే విధంగా బోయిగూడ బ్రిడ్జి కింద సైతం పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరాయి. అదేవిధంగా పద్మారావునగర్, భోలక్‌పూర్, గొల్లకొమురయ్య కాలనీ, చాచానెహ్రూనగర్, పద్మారావునగర్, మోండా మార్కెట్, బండిమేట్, నాలా బజార్, సజ్జన్‌లాల్‌స్ట్రీట్, రాణిగంజ్, కట్టెల మండి, గొల్లకొమురయ్య కాలనీ, గాంధీనగర్ ప్రాంతాల్లో జనం అవస్థలు పడుతున్నారు.



పద్మారావునగర్ ప్రధాన రహదారిపై పారుతున్న వరద

☛ వర్షం కారణంగా పలు ప్రాంతాలు జలమయంగా మారుతున్నా.. జీహెచ్‌ఎంసీ, జలమండలి తదితర విభాగాల అధికారులు సమస్య పరిష్కారంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్ల తూతూమంత్రంగా నాలాల్లో మట్టి చెత్తాచెదారాన్ని తొలగించి చేతులు దులుపుకుంటున్నారు. ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దుర్గామాత ఊరేగింపులో చింతల్ బస్తీ యువకులు

దుర్గామాత నిమజ్జనం

లాలాపేట: తార్నాక చింతల్‌లో అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద యువసేనా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని ఆదివారం రాత్రి ట్యాంక్ బండ్‌లో నిమజ్జనం చేశారు. అంతకుముందు భాజా భజంత్రీలు, కళాకారుల నృత్యాలు, విద్యుత్ లైట్ల వెలుగుల్లో అమ్మవారిని తార్నాక ప్రాంతంలో ఊరేగించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు చింతల్ కిట్టు, యువ సేనా యూత్ అసోసియేషన్ శ్యామ్, బాలు, ప్రసాద్, రాహుల్ భాస్కర్, చింతల్ నరేశ్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 45, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 45, క్యాప్సికం 55, పచ్చకాకర 31, పందిరి బీర 45, క్యాబేజీ 21, క్యారెట్ 55, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 65, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 43, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 45, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 6–7, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

'సుప్రీం సీజేఐపై దాడి హేయం'

లాలాపేట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్. గవాయిపై లాయర్ దాడి చేయడాన్ని తెలంగాణ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ డాక్టర్ నంద్రు నరసింహ మాదిగ తీవ్రంగా ఖండించారు. ఓయూలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. నిందితుడిని దేశద్రోహిగా ప్రకటించాలని, అవసరమైతే దేశ బహిష్కరణ చేయాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులు పునరావృతం అయితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆర్ఎస్ఎస్, మనువాద సనాతన శక్తులను ఆయన హెచ్చరించారు.

గ్రేటర్ ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానం



అవార్డు అందుకుంటున్న రామారావు

బొల్లారం: ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రేటర్ ఎక్సలెన్సీ అవార్డ్స్–2025' వేడుక వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వ్యక్తులు, సంస్థలకు ఊక్కి ఇండియా ప్రెసిడెంట్ చైతన్య జంగా, సెక్రటరీ వి.ఎస్. వర్మ పాలకపాటి ముఖ్య అతిథులుగా హాజరై అవార్డులు ప్రదానం చేశారు. ఉత్తమ హెర్బల్ ఉత్పత్తులు విభాగంలో తిరుమలగిరికి చెందిన ఎం.ఆర్ హెయిర్ అండ్ బ్యూటీ సంస్థ చైర్మన్ టి. రామారావు అవార్డు అందుకున్నారు.

వైద్య వృత్తికే వన్నె తేవాలి

- గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిరా
- సందడిగా ఓరియంటేషన్

గాంధీఆస్పత్రి : వైద్య వృత్తికే వన్నె తెచ్చి.. రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిరా సూచించారు. 2025 బ్యాచ్ వైద్యవిద్యార్థులు, వారి తల్లితండ్రుల పరిచయ కార్యక్రమం గాంధీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో సోమవారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన విద్యార్థుల్లో మానసిక ధైర్యం పెంపొందించి ఒత్తిడిని అధిగమించేలా సైకియాట్రి విభాగం ఆధ్వర్యంలో ప్రతివారం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. ర్యాగింగ్ నిరోధానికి చర్యలు చేపట్టామని, మొదటి ఏడాది కనీసం 80 శాతం హాజరు ఉండాలన్నారు. కష్టపడి చదివి, గాంధీ కళాశాల, ఆస్పత్రుల పేరును మరింత ఇనుమడింపజేయాలని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి కోరారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పరిచయం కార్యక్రమం నిర్వహించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖరరావు, రాజారామ్, పలు విభాగాల వైద్యులు రమాదేవి, కోటేశ్వరమ్మ, సుబోధ్‌కుమార్, సుధారాణి, ప్రజ్ఞ, అనుపమ, సుధాకర్, ఎంపీహెచ్ఓ వేణుగోపాల్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.





హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

రేపు ఎల్డర్స్ వయో సేవారత్న అవార్డ్స్ ప్రదానం

సనత్‌నగర్: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'ఎల్డర్స్ వయో సేవారత్న అవార్డ్స్–2025' ప్రదానోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు సారిపల్లి కొండల్‌రావు, జీఎస్‌టీ శాయి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మోడల్‌కాలనీలోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు జరిగే వేడుకలకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, యూసీడీ అడిషనల్ కమిషనర్ పంకజ, ఖైరతాబాద్ సర్కిల్ యూసీడీ డీపీఓ శ్రీనివాస్, సుందర్‌నగర్ యూనియన్ బ్యాంక్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ శేఖర్ అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

దుర్గామాత ఆలయంలో చండీహోమం..

సనత్‌నగర్: ఆశ్వీయుజ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా హనుమాన్ ఆలయం (సెవెన్ టెంపుల్స్) ప్రాంగణంలోని దుర్గామాత ఆలయంలో మంగళవారం ఉదయం 8 గంటలకు చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే దత్తాత్రేయ స్వామి వారికి 6 గంటలకు అభిషేకం, 9.30 గంటలకు దత్తహోమం చేపడుతామని పేర్కొన్నారు.

రోబోటిక్‌తో ఉత్తమ ఫలితాలు

రాంగోపాల్‌పేట్: ప్రొంకియాటిక్ కేన్సర్ శస్త్ర చికిత్సల్లో రోబోటిక్ టెక్నాలజీతో వాడకంతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆధ్వర్యంలో 'ప్రొంకియాటిక్ కేన్సర్ 360' అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. అత్యాధునికంగా వచ్చిన రోబోటిక్ శస్త్ర చికిత్సతో కుట్లు కూడా మరింత సున్నితంగా వేయడంతో మరింత మెరుగైన ఫలితాలు రాబడుతున్నారన్నారు. కిమ్స్ ఆస్పత్రి సర్జికల్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ ప్రొంకియాటిక్ సర్జన్ డాక్టర్ మధు దేవరశెట్టి మాట్లాడుతూ.. రోబోటిక్‌తో ప్రొంకియా కేన్సర్ చికత్సతో ఐసీయూ, ఆస్పత్రిలో రోగులు కోలుకునే సమయం గణనీయంగా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి సీఈఓ డాక్టర్ అభినయ్, మెడికల్ డైరెక్టర్ సంబిత్ సాహూ, కేన్సర్ నిపుణులు డాక్టర్ ఎం శ్రీనివాస్, డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డాక్టర్ కేవీ ఎఎస్‌రాజు, డాక్టర్ జగదీశ్వర్‌గౌడ్, డాక్టర్ నాగేంద్ర పర్వతనేని తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో డాక్టర్ భాస్కర్‌రావు తదితరులు

సమయపాలన పాటించకుంటే చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం

లాలాపేట: సమయపాలన పాటించని అధ్యాపకులపై చర్యలు తప్పవని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం హెచ్చరించారు. క్యాంపస్‌లోని ఆయా కళాశాలలు, విభాగాలను సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులు తరగతి గదుల్లో ఉన్నప్పటికీ అధ్యాపకులు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి హాజరు పట్టికలను పరిశీలించి వివరణ తీసుకోవాలని ఆయా విభాగాల అధిపతులను ఆదేశించారు. విద్యాబోధన, పరిశోధనల్లో చురుగ్గా పాల్గొని ఓయూ సమగ్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి యూనివర్సిటీ నుంచి కావాల్సిన సహకారాన్ని అందిస్తామన్నారు. ఆయన వెంట ఓఎస్డీ ప్రొ జితేందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

దాతల సహకారంతో మరింత మెరుగైన వైద్యం

గాంధీఆస్పత్రి: కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహాయ సహకారాలతో నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించే అవకాశం కలుగుతుందని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి అన్నారు. ఆర్పన్ రోగి సహాయత ట్రస్ట్‌తో పాటు పలు సంస్థల సంయుక్తాధ్వర్యంలో అధునాతన హంగులతో తీర్చిదిద్దిన గాంధీ ఆర్థోపెడిక్, బర్న్సవార్డు, ప్లాస్టిక్ సర్జరీ, ఆపరేషన్ థియేటర్లను ఆయా సంస్థల ప్రతినిధులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిషోరాజ్ సురాన ఫ్యామిలీ, ఎస్‌పీఎం గ్రూప్, ఎస్‌వీఎస్ రిఫ్క్యాంప్ ప్రైవేట్ లిమిటెడ్‌ల సంయుక్త నేతృత్వంలో సుమారు రూ. 50 లక్షల వ్యయంతో ఆధునీకరించి, అత్యాధునిక వైద్యయంత్రాలు ఏర్పాటు చేసి, 12 అడ్వాన్స్‌డ్ ఎయిర్ కండీషన్ మెషిన్లను వితరణగా అందించారన్నారు. దీంతో దాతలను అభినందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు వనిత, చందులాల్‌పటేల్, కోమల్, ప్రిమల్‌ఫరేఖ్, అనిత, కేతస్ఫరేఖ్, మనీషా, మయాంక్‌సేథ్, ఆరాధన, సుధీర్‌మెహత, పూనం, హితేంద్ర, దేవేందర్‌మోహత, వినయ్ సురాన, విష్ణుభద్రుక, వీణజైన్, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖర్‌రావు, ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీలు శ్రీనివాస్, సుబోధ్‌కుమార్, ఆర్‌ఎంఓలు శేషాద్రి, రజనీ, కళ్యాణ్, ఆర్పన్‌రోగి సహాయత ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



రెనోవేషన్ చేసిన ప్లాస్టిక్ సర్జరీ ఆపరేషన్ థియేటర్‌లో దాతలతో వైద్యులు

'ట్రిపుల్ ఆర్'కు వ్యతిరేకంగా రైతుల ఆందోళన



హెచ్‌ఎండీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

అమీర్‌పేట: ట్రిపుల్ ఆర్‌ను వ్యతిరేకిస్తూ అమీర్‌పేట హెచ్‌ఎండీఏ కారాలయం ఎదుట సోమవారం రైతులు ఆందోళనకు దిగారు. కొత్తగా రూపొందించిన అలైన్‌మెంట్ వెంటనే మార్చాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'ట్రిపుల్ ఆర్ వద్దురా.. వ్యవసాయమే ముద్దురా' అంటూ నినాదాలు చేశారు. ఆందోళనకు సీపీఎం నాయకులు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అలైన్‌మెంట్‌పై రైతులకు స్పష్టతనివ్వాలని, అనుమతుల్లేకుండా భూసేకరణ చేపట్టవద్దన్నారు. గ్రామాల వారీగా సభలు ఏర్పాటు చేసి నష్టపరిహార ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం కొంతమంది రైతులు కార్యాలయంలోకి వెళ్లి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కార్యాలయం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. యాదాద్రి, సంగారెడ్డి, గజ్వేల్, భువనగిరి, చౌటుప్పల్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై ఐక్యంగా పోరాడదాం

పంజగుట్ట: రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల సాధన, జర్నలిజం విలువల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న ఏకైక జర్నలిస్టు యూనియన్ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్)లో తమ సంఘాన్ని విలీనం చేస్తున్నట్లు తెలంగాణ ఆల్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీఏజేఎఫ్) ప్రకటించింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీఏజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రఘురాం, ప్రధానకార్యదర్శి దత్తాత్రేయ రాజేందర్, జాతీయ కన్వీనర్ కూసం సారంగపాణి మాట్లాడుతూ.. 2020లో ఏర్పడిన తమ సంఘం రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో కమిటీలు ఏర్పడి జర్నలిస్టుల సమస్యలపై అధ్యయనం చేశామని తెలిపారు. ఇటీవల జర్నలిస్టుల సంఘాలు అనేకం పుట్టుకురావడం, కొన్ని యూనియన్లు పాలకుల పక్షాన చేరి జర్నలిస్టులను విస్మరించడం వల్ల ప్రభుత్వాలు కూడా జర్నలిస్టులను చిన్నచూపు చూస్తున్నాయని అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఆనందం, జగన్, విజయ్ కుమార్, తస్నీరు శ్రీనివాస్, మధు, వెంకటస్వామి, గోపాల్, నాంపల్లి శ్రీనివాస్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



ఫెడరేషన్‌లో విలీనం అయిన సంఘం నాయకులకు సభ్యత్వాలు ఇస్తున్న మామిడి సోమయ్య